# బుడగ

క్యాంపు నుంచి అప్పుడే వచ్చాను. వచ్చీ రావటంతోటే మా ఆవిడ 'సత్యాన్ని అత్యవసర పరిస్థితుల్లో హాస్పటల్‌లో చేర్పించామని, వెంటనే బయలుదేరి రమ్మని మీ అక్కయ్య హైదరాబాద్ నుంచి ఫోన్ చేసిందని, ఆందోళనలో వుండి ఇతర విషయాలేమి చెప్పలేదని' చెప్పింది.

గబగబా నాలుగు మెతుకులు కతికి, బస్టాండుకు చేరి, బస్‌లో హైదరాబాద్‌కు బయలుదేరాను. తెల్లారేటప్పటికి చేరుతాను. ఎంత ఆలోచించినా నాకేమి దరీబరీ అందటంలేదు. సత్యానికేమైనా యాక్సిడెంటయిందా లేక కొంపదీసి వీడే ఏదయినా అఘాయిత్యం చేశాడా?

మా బావ ఉద్యోగరీత్యా ముప్పయేళ్ళ నుంచి హైదరాబాద్‌లోనే వుంటున్నాడు. రిటైర్ అయిన తరువాత అక్కడే సెటిలయినాడు. వాళ్ళకు సత్యం ఒక్కడే కొడుకు. అందుకని వాడిని అల్లారుముద్దుగా పెంచటమే కాక, మంచి విద్యాబుద్ధులు కూడా చెప్పించారు. సత్యం అందమైన కుర్రాడే కాక బాగా చురుకైన వాడు, బుద్ధిమంతుడు.

ఎక్కడా ఎమ్.ఎస్.ఎమ్‌లు లేకపోవుటచే చిన్న వయసునే పి.జి కూడా పూర్తిచేశాడు. అదిగో అప్పుడే వచ్చింది సరిగ్గా ఈ సాఫ్ట్‌వేర్ బూమ్. సాఫ్ట్‌వేర్ రంగంలోని నోట్ల ఫెళఫెళలు, తళతళలు చూసిన కుర్రకారుకు కిర్రెక్కిపోయింది. చేస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే చేయాలనే వెర్రెక్కింది. సత్యం కూడా సాఫ్ట్‌వేర్ కోర్స్ పూర్తిచేసి, ఆ రంగంలోనే ఉద్యోగాన్వేషణలో పడ్డాడు. త్వరలోనే సత్యానికి హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి ఉద్యోగం దొరికింది.

జీతం ప్రారంభంలోనే యాభైవేలు. తెలివైనవాడు కావటంతో రెండంచలలోనే ఎదిగి లక్షలో పడ్డాడు.అలా పడ్డందుకు మా అక్కయ్య, బావే కాక, మేము కూడా ఎంతో మురిసిపోయాం. కేవలం మురిసిపోవటమే కాక, తమను ఒక హైలో జమచేసుకొని, ఆ లైఫ్ స్టైల్‌కు అనుగుణంగా, ఆధునిక హంగులు, వస్తువాహనాలు అమర్చుకొని విలాసాలకు, ఆర్భాటాలకు లోనవుతున్నారు మా వాళ్ళు.

అలాంటి కంపెనీల్లో ఉద్యోగవిధులు, టైమింగ్స్ ఇతర కంపెనీలలో మాదిరిగా ఉండవట. రోజుకు పది పన్నెండు గంటలు పనిచేయాలట. ఎక్కువగా రాత్రులే పనులుంటా యట. ఒక్కొక్క సీజన్‌లో ఇంకా ఎక్కువ సమయాలే పనులుంటాయిట. వాళ్ళ కంపెనీకి చాలా అమెరికన్ కంపెనీలతో ఔట్‌సోర్సింగు లావాదేవీలున్నాయిట. ఏదో మాటల సందర్భంలో మా సత్యం ద్వారా తెలిసిన సంగతులివి.

''అదేంటిరా! సత్యం ఇలా రాత్రిళ్ళు వేళాపాళా లేకుండా పనిచేస్తుంటే మీ ఆరోగ్యాలు దెబ్బతినవా? ఇంతటి మానసిక, శారీరక శ్రమతో మీరు వాళ్ళ కంపెనీలలో ఎంతకాలం పనిచేయగలరని'' అడిగాను.

''నిజమే మామయ్యా అందుకే గదా! వాళ్ళు మాకంతంత జీతాలివ్వడం. మనకిక్కడ రాత్రయితే వాళ్ళక్కడ పగలు. వాళ్ళు వాళ్ళ ఆఫీసుల్లో పగలే పనిచేస్తుంటారు. వాళ్ళు పనిచేసే టైమ్‌లోనే వాళ్ళకవసరమైన ఇన్‌ఫర్మేషన్ కావాల్సుంటుంది. ఆ ఇన్‌ఫర్మేషన్ అందితేనే వాళ్ళక్కడ వాళ్ళ పనులు, ప్రోగాములు చేసుకోగలరు. అందుకొరకే మేమిక్కడ రాత్రి, పగలు బేధం లేకుండా పనిచేయాలి. అందుకే వాళ్ళు మాకంతంత జీతాలు ఇస్తారు. పైగా మాకిక్కడ వర్కులోని 'స్ట్రెస్ అండ్ స్ట్రెయిన్' రిలీఫ్ కొరకు కంపెనీ వాళ్ళే క్యాంటీన్స్, క్లబ్‌లు ఏర్పాటు చేస్తుంటారు. ఇతరులు కూడా దగ్గరలోనే క్లబ్బులు, పబ్బులు, ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లు

వి.ఎల్.ప్రసాదరావు

## దిక్కు

ఎత్తున - యాంటెనాలు
చూపు ఆకాశంలోకి
సిగ్నల్స్ కోసం!
కింద మనుషులు
చూపు మబ్బులకేసి
చినుకుల కోసం!!
అది-
సాంకేతిక అభివృద్ధికి
సంకేతం!
ఇది-
మనిషి మనుగడకై
ఆరాటం?!

బాలం వెంకట్రావు

ఏర్పాటు చేస్తుంటారు. అప్పుడప్పుడు వాటిల్లో రిలాక్స్ అవుతుంటాం'' అన్నాడు సత్యం.

''అయితే అమెరికన్లు ప్రత్యక్షంగా వాళ్ళ వ్యాపారాన్ని, పరోక్షంగా వాళ్ళ సంస్కృతినీ దిగుమతి చేస్తున్నారన్న మాట. దానికి మన నల్ల నక్కలు తెల్ల వేషాలలో సహక రిస్తున్నవన్నమాట. మీరు మీ ఆరోగ్యాలను అమ్ముకొని సంపాదించిన పైసలతోటే మీ ఆరోగ్యాలను తిరిగి కొను క్కుంటారన్నమాట. మీ వ్యాపార పద్ధతులు చాలా చాలా బాగున్నవి రా! కుడి చేతి సంపాదన ఎడమ చేయిగుండా పోతుందన్నమాట'' అన్నాను.

బస్సులో నిద్రపట్టక ఇలాంటి సంఘటనలన్నీ గుర్తొస్తున్నవి.

హైదరాబాద్ చేరేటప్పటికి తెల్లారింది. నేరుగా అక్కయ్య ఇంటికి వెళ్ళాను. బావ ఇంట్లోనే వున్నాడు. అక్కయ్య ఆసుపత్రిలో వుందట. బావ నన్ను చూసి తల పట్టున్నాడు. ఏంటి బావ అంటే మీ అక్కయ్య నిదానంగా అన్ని సంగతులు చెబుతుందిలెమ్మన్నాడు.

ఆసుపత్రి వివరాలు బావ నుండి తెలుసుకొని అక్కడి కెళ్ళాను. సత్యాన్ని ఐ.సి.యులో వుంచారు.

నన్ను చూడగానే అక్కయ్య భోరుమంది. ఏమిటే అంటే ''సత్యం మొన్న రాత్రి నిద్రమాత్రలు మింగా డటరా! నిన్న ఉదయం లేవకపోయేటప్పటికి చూస్తే ఇదీ సంగతి. వెంటనే ఈ ఆసుపత్రిలో చేర్పించాం. ఇక్కడ ఐ.సి.యులో వుంచి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఇందాకనే స్పృహ వచ్చిందని'' చెప్పింది.

డాక్టర్లని సంప్రదిస్తే ప్రమాదం తప్పిందని రేపింటికి తీసుకెళ్ళొచ్చని చెప్పారు. సత్యాన్ని పలకరించాను. నన్ను చూసి సిగ్గుతో తలదించుకున్నాడు.

నేను, అక్కయ్య దినకృత్యాల నిమిత్తం ఇంటికొచ్చి

## నానీలు

తినీ తినక
చిట్‌కు జమ
తిరిగివచ్చేది
భ్రమ
　　ఇతరులకు
　　చెప్పకు గుట్టు
　　తప్పక
　　అవుతుంది రట్టు
మంది సొమ్ముతో
వైభోగం
మందికి మాత్రం
శఠగోపం
　　మంది సొమ్ము
　　పైనే కన్ను
　　అవినీతి
　　కదే దన్ను
కదలవు
ఫైళ్ళు
లంచం
పైనే కళ్ళు
　　మోసం
　　మెరుపు
　　మంచికి వెరపు

కొమ్మినేని సుధారాణి

బావని ఆసుపత్రికి పంపాము.ఏమిటే సంగతని అక్కయ్య నడిగితే మరొకసారి బోరుమని చెప్పింది విషయమంతా. మా అక్కయ్య చెప్పిందాని సారాంశమిది. సత్యం లక్ష రూపాయల జీతంలో పడ్డాక వాళ్ళు పారవశ్యంలో లోకం మరచి, వాళ్ళేదో గొప్పవాళ్ళమయిపోయామనుకొని, గొప్పల కోసం, మిధ్యాగౌరవం కోసం కారు వగైరా విలాస వస్తు సముదాయం వాడి లక్షజీతం హామీతో దొరికిన చోటల్లా అప్పుచేసి సమకూర్చుకున్నారట. బ్యాంకులే కాక ఇతర వ్యక్తుల నుంచి కూడా ఋణాలు తీసుకున్నారట. ఈ విలాస జీవన మోజులో పడి సత్యం కూడా దారి తప్పి దురలవాట్లకు లోనయ్యాడట. క్లబ్‌లు, పబ్బులే కాకుండా మత్తు పదార్థాలు కూడా తీసుకుంటున్నాడట. ఈ విషయాలు మాకిటీవలే తెలిసినవి.

ఇదిలా వుంటే, ఇటీవల అమెరికాకు ఆర్థిక మాంద్యం దెబ్బతగిలిందట. ఆ దెబ్బ ప్రభావానికి సాఫ్ట్‌వేర్ బుడుగ చితికిపోయి, వీళ్ళ కంపెనీ దివాలెత్తి, వీళ్ళందరి ఉద్యోగాలు ఊడి రోడ్డున పడ్డారట. ఇక ఇప్పట్లో వీళ్ళకి ఉద్యోగాలెవరిస్తారు. ఉద్యోగం లేని బాధొకటలా వుంటే, వీడి లక్షరూపాయల నెల జీతం చూపించి అప్పుచేసి కొన్న కారు, గీరు వగైరా వస్తు సామాగ్రంతా ఏంచేసేట్టు? అప్పుల వాళ్ళు టకాయిస్తున్నారు. మా పని 'పైకెత్తానాం దించానం' లాగుంది. కొత్తనీరొచ్చి పాతనీరు కొట్టుకు పోయినట్లు, ఈ దెబ్బతో మాకున్నది కూడా ఊడ్చుకు పోయేట్లుంది. పరిస్థితులిలా విషమంగా తయారయ్యే టప్పటికి ఈ బాధలకు తాళలేక వీడిలా నిద్రమాత్రలు మింగి కొంపమీదికి తెచ్చాడు'' అంటూ మా అక్కయ్య బావురుమన్నది.

పరిస్థితెంత ఘోరంగా తయారైందో అర్థమైంది. నేను కూడా డీలాపడితే ఎలా? అందుకని ధైర్యం తెచ్చుకొని అక్కయ్యకు స్వాంతవచనాలు, ధైర్యవచనాలు చెప్పి సముదాయించాను.

''జరిగిందేదో జరిగిందిలే నడమంత్రం సిరి వచ్చినట్లే వచ్చి పోయిందనుకో. ఇప్పుడు మాత్రం మీకొచ్చిన లోటేముంది. బావపెన్షన్ వుంది, ఇల్లుంది. జీవనానికి ఇబ్బంది లేదుకదా! ఇక సత్యంకు కొంతకాలానికైనా మరొక కంపెనీలో ఉద్యోగం దొరక్కపోదు. బాగా చదువుకున్న వాడే కదా! కనుక ఇటీవల వాడికైన చెడు అలవాట్లను తప్పించి దారిలో పెట్టు. త్వరలోనే అన్నీ చక్కబడతాయి'' అని అక్కయ్యకు ధైర్యం చెప్పాను.

హైదరాబాద్‌లో సత్యాన్ని హాస్పటల్ నుంచి డిశ్చార్జి చేసి, ఇంటికి తెచ్చేదాకా రెండ్రోజులుండి, బావకి కూడా ధైర్యవచనాలు చెప్పి గుంటూరుకు బయలుదేరాను.

రైల్లో వస్తుంటే జరిగినదంతా కళ్ళముందు రీల్‌లా తిరిగి చిన్నప్పుడు చదువుకున్న సుమతీ శతకంలోని పద్యం మదిలో మెదిలింది.

సిరితా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్
సిరితా పోయిన పోవును
కరి మ్రింగిన వెలగ పండు కరణిని సుమతీ! ■

## తుస్సుమన్న సంబరం

కొన్నేండ్ల కల
నిజమైన వేళ
గుండె నిండిన సంబరం
గాలి ఊదిన బెలూన్ వోలె
అంబరాన్ని తాకింది.
ఇరవై ఏండ్ల దాంపత్యాన్ని
పిల్లి మాదిరి
కిరాయి ఇళ్ళల్లో తిప్పిన వైనానికి
సొంతిల్లేదని
పెళ్ళాం దెప్పింది
ఎగిసిన రేషం
ఉన్న కాస్త షరం
రచ్చకెక్కుతుందేమోనన్న భయం
ఓ ప్లాటు కొనేట్లు చేసింది...
ఇక ఇల్లు కడ్తామంటే
ఎటు ఇరవై ఐదడుగుల నైరుతి
ప్లాటు
వాస్తు సిద్ధాంతాలు,
కార్పొరేషన్ నిర్దేశాల మధ్య
సెలగకొసిన సంబరం
నేలకొరిగింది.

మహమ్మద్
తహసీన్ అలి